జిల్లాకు 1,340 మెట్రిక్ టన్నుల డీఏపీ

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే: క్రిబ్‌కో కంపెనీకి చెందిన 1,340 మెట్రిక్ టన్నుల డీఏపీ బుధవారం రైలు ద్వారా జిల్లాకు చేరింది. అందులో 670 మెట్రిక్ టన్నులు ఏపీ మార్క్‌ఫెడ్ కేటాయించడం జరిగింది. మిగిలిన 670 మెట్రిక్ టన్నుల డీఏపీని ప్రైవేటు డీలర్లకు కేటాయించామని అనంతపురం వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీ రవికుమార్ తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ ఆదేశాలు మేరకు జిల్లాలో రసాయన ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలన్నారు. ఎక్కడైనా డీలర్లు ఎరువులను అధిక ధరలకు అమ్మితే లైసెన్సు రద్దు చేయడమే కాకుండా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఏడీ రవి హెచ్చరించారు.

వాన.. రాకపోకలు పలుచన



నిత్యం ట్రాఫిక్‌కు పరాకాష్ఠగా నిలిచే నగరంలోని టవర్ క్లాక్ పరిసరాలు.. మేఘాలు కమ్మి ముసురేసిన సమయంలో బుధవారం ఉదయం 9 గంటలకు రద్దీ పలుచగా కనిపించింది. **- ఈనాడు, అనంతపురం**



ఏర్పాట్లపై చర్చిస్తున్న బీసీ సంక్షేమ రాష్ట్ర సంచాలకులు మల్లికార్జున, కలెక్టరు వినోద్‌కుమార్

నేడు రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి

అశోక్‌నగర్ (అనంత సంక్షేమం), న్యూస్‌టుడే: అనంతపురంలో మహర్షి వాల్మీకి జయంతిని పండుగలా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడంతో అనంతపురంలోనే బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వేడుకకు సన్నద్ధం చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు అనంతపురం పవర్ ఆఫీసు వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తారు. అనంతరం నగరం శివారు గుత్తి రోడ్డులోని మార్కెట్ యార్డు పక్కన ఉన్న బల్లా కన్వెన్షన్ హాల్లో ఉదయం 11 గంటలకు సభా కార్యక్రమం నిర్వహించనున్నారు.

★ రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగలా గురువారం నిర్వహించుకోవాలని ప్రకటించిందని బీసీ సంక్షేమ రాష్ట్ర సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టరు మల్లికార్జున, కలెక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సదస్సు నిర్వహించే సభాస్థలిని బుధవారం వారు పరిశీలించారు. ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలిచ్చారు.

ముందస్తు పునరావాస కేంద్రాలు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: భారీ వర్షాల దృష్ట్యా అనంతపురం నగరంలో ముందస్తుగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని ఇంకా అవసరం అయితే మరిన్ని సిద్ధంగా ఉంచాలని కలెక్టరు వినోద్‌కుమార్ నగరపాలక అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. తుపాను ప్రభావం వల్ల నగరంలో ఉన్న పరిస్థితిపై బుధవారం కలెక్టరు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్షేత్రస్థాయిలో మరువ వంక, నడిమి వంక, పలు పెద్ద మురుగు కాలువలను పరిశీలించి.. ఆయా ప్రాంతాల్లోని ప్రజలో మాట్లాడారు. నగరంలోని పొట్టి శ్రీరాములు నగరపాలకోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఆరో రోడ్డు కైలాసం రోడ్డులో ఉన్న తాగునీటి పైపులైను మార్చాలని ప్రజలు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. పూడికతీత పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు.

ముంచేసిన ముసురు!

➤ వాయుగుండంతో జడివాన ➤ ఉమ్మడి జిల్లాలో వేరుసెనగ, టమాటా, మిరప రైతులకు నష్టం

ఈనాడు అనంతపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో మంగళవారం రాత్రి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షం పడుతోంది. మరోవైపు ముసురు పట్టి. . వాతావరణం చల్లబడింది. దీంతో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వేరుసెనగతో పాటు మిరప, టమాటా, దానిమ్మ తదితర పంటలకు నష్టం వాటిల్లింది. అనంతపురం జిల్లాతో పోలిస్తే శ్రీసత్యసాయి జిల్లాలో నష్టం ఎక్కువగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బుధవారం సాయంత్రానికి అనంతపురం జిల్లాలో సగటున 13.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో 26.4 మి.మీ.కురిసింది. అత్యధికంగా ముదిగుబ్బ మండలంలో 54 మి.మీ.వర్షపాతం నమోదైంది. కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా జయమంగళ నదిలో వరద ప్రభావం కనిపించింది.

తెగుళ్ల భయం

బహిరంగ మార్కెట్‌లో టమాటా ధరలు ఆశాజనకంగా ఉన్నా వర్షం కారణంగా దిగుబడిపై ప్రభావం పడింది. వానకు టమాటా పూత రాలుతోంది. పలు మండలాల్లో కాయలు సైతం నేలరాలడంతో అన్నదాతలకు తీరని నష్టం వాటిల్లింది. వాతావరణం చల్లబడటంతో కాయలపై మచ్చలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా రైతులకు మార్కెట్ ధరలో సగం కూడా వచ్చే అవకాశం లేకుండా పోతోంది. ఉరవకొండ, గుంతకల్లు, రాయదుర్గం ప్రాంతాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లింది. అధిక తేమ కారణంగా మొక్క ఎదుగుదల ఆగిపోవడంతో పాటు పూత రాలుతుండటంతో దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుళ్లుతున్న వేరుసెనగ

జూన్‌లో ముందుగా విత్తుకున్న వేరుసెనగ ప్రస్తుతం కోత దశలో ఉంది. ఉమ్మడి అనంత జిల్లాలో చాలామంది రైతులు పంటను తొలగించి పొలాల్లోనే కుప్పలుగా వేశారు. వర్షంతో పంట నల్లగా మారి పొలాల్లోనే కుళ్లిపోతోందని రైతులు వాపోతున్నారు. అనంతపురం జిల్లాలో 2.90 లక్షల ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 93 వేల ఎకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. ప్రస్తుతం 30 శాతం కోత దశలో ఉంది. గురువారం వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు నష్టాన్ని అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.




ముదిగుబ్బ: పొలంలో తడిసిపోవడంతో నల్లగా మారిన వేరుసెనగ

పశుగ్రాసమైనా దక్కేలా లేదు



నాకున్న 5 ఎకరాలతో పాటు 3 ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుసెనగ సాగు చేశా. 5 ఎకరాల్లో పంట తొలగించి పొలంలోనే ఉంచాను. కౌలుకు తీసుకున్న మూడెకరాల్లో పంట కోత పూర్తిచేసుకుని వచ్చే సరికి వర్షాలు మొదలయ్యాయి. మిగిలిన 5 ఎకరాల్లో పంట నల్లగా మారిపోయింది. పశుగ్రాసానికి అసలు పనికిరాదు. ఇంకోరోజు వర్షం కురిస్తే కాయలు బూజుపట్టి మొలకెత్తుతాయి. **- మల్‌రెడ్డి, కనగానపల్లి**



తోటలో నేలరాలిన టమాటాలు

మండలాల్లో వర్షపాతం ఇలా..

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో మండలాల వారీగా వర్షపాతం వివరాలు పరిశీలిస్తే.. కంబదూరులో 29.8 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది. కుందుర్పి 26.8, వజ్రకరూరు 20.8, ఉరవకొండ 20.0, రాప్తాడు 19.2, కళ్యాణదుర్గం 18.8, ఆత్మకూరు18.4, యల్లనూరు, శెట్టూరు మండలాల్లో 18.0 మి.మీ చొప్పున, గుత్తి 16.8, పుట్లూరు 16.2, పామిడి, గుమ్మగట్ట మండలాల్లో 15.2 మి.మీ చొప్పున, విడపనకల్లు 15.0, నార్పల 14.8, పెద్దవడుగూరు 13.6, బ్రహ్మసముద్రం 13.2, యాడికి, తాడిపత్రి మండలాల్లో 12.4 మి.మీల చొప్పున వర్షపాతం నమోదయింది. పెద్దపప్పూరు, బెళుగుప్ప, కూడేరు, శింగనమల, బొమ్మనహాళ్, గుంతకల్లు, రాయదుర్గం, అనంతపురం, గార్లదిన్నె, కణేకల్లు, డి.హీరేహాళ్, బుక్కరాయసముద్రం మండలాల్లో జల్లులు పడ్డాయని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

నేల రాలుతున్నాయి..



రూ.20 లక్షలు పెట్టుబడి పెట్టి 10 ఎకరాల్లో టమాటా సాగు చేశాను. ఇప్పటికీ ఐదు కోతలు పూర్తయ్యాయి. వర్షాల కారణంగా కాయలు దెబ్బతింటున్నాయి. కాయలు నేలరాలడంతో పాటు మచ్చలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. **- సుభాస్కర్, ముదిగుబ్బ**

వారంలో రెండు రోజులు ధ్రువపత్రాల జారీ

అనంతపురం (వైద్యం): ప్రభుత్వం అందజేసే ఎన్టీఆర్ పింఛన్ కానుకను పొందేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో అర్హులైన రోగులకు ఈనెల 22 తరువాత పనిదినాల్లో ప్రతి మంగళవారం, శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెడికల్ బోర్డు సర్టిఫికెట్లను జారీ చేస్తామని అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. తలసీమియా, చికిల్‌షెల్ అనిమీయా, హిమోఫీలియా, పక్షవాతం, డయాలసిస్, కిడ్నీ తొలగించిన బాధితులు, గుండె, లివర్ మార్పిడి, కుష్ఠు వ్యాధితో మంచానికే పరిమితమైన వారితోపాటు తీవ్ర ఆరోగ్య సమస్యలున్నవారికి మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు జారీ చేస్తామని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే 29 నుంచి సమ్మెలోకి

అనంతపురం(వైద్యం): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద కాంట్రాక్టు పనిచేస్తున్న చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 29నుంచి సమ్మెలోకి వెళతామని ఏపీ విద్యామిత్ర కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తెలిపారు. ఇప్పటికే తమ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లాకో ఆర్డినేటర్‌ను కలిసి వినతి పత్రం అందజేయటంతో పాటు సమ్మె నోటీసు అందజేశామని పేర్కొన్నారు. 15రోజుల పాటు దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని అప్పటికీ ప్రభుత్వ స్పందించకపోతే సమ్మెలోకి వెళతామని పేర్కొన్నారు.

ఉన్నా ఉపయోగం లేదాయె

➠ వృథాగా రైతుబజార్లు ➠ కూరగాయల కొనుగోలుకు తప్పని తిప్పలు

అనంతపురం (వ్యవసాయం), హిందూపురం, న్యూస్‌టుడే

రైతులు పండించిన కూరగాయలు నేరుగా వినియోగదారులకు విక్రయించి ఆదాయం పొందడం.. వినియోగదారులకు తాజా, చౌకగా అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో గతంలో తెదేపా ప్రభుత్వం రైతుబజార్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా అనంతపురం, హిందూపురంలో రైతుబజార్లను నిర్మించింది. అప్పట్లో రైతులు, వినియోగదారులతో కళకళలాడేవి. ముఖ్యమంత్రులుగా పనిచేసిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి హయాంలో రైతుబజార్లు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. కనీసం రైతులు అటువైపు రాకుండా చేశారు. దళారులను ప్రోత్సహించే పరిస్థితికి తీసుకొచ్చారు. అన్నదాత చితికిపోయేలా చేశారు. ఈక్రమంలో కమీషన్లు, తరుగు పేరుతో పెద్దఎత్తున వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారు. పచ్చి సరకు పేరిట 10 శాతం కమీషన్, 10 శాతం తరుగుతో దోపిడీకి పాల్పడుతున్నారు. తూకాల్లోనూ మోసం చేస్తున్నారు. ఇంత చేస్తున్నా మార్కెటింగ్, తూనికలు, కొలతలు శాఖ అధికారులు ఏమీ పట్టనట్టుగా ఉన్నారు.



అధ్వానం

అనంతపురం పాతూరు కూరగాయల మార్కెట్ తీరు ఇది. నిత్యం అపరిశుభ్రంగా ఉంటుంది. వానొస్తే అడుగువేయలేని దుస్థితి. ఆ ప్రాంతం అంతా ఇరుకుగా ఉంటుంది. ఇక్కడ మండీ వ్యాపారులు రైతుల నుంచి వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. కమీషన్, తరుగు పేరుతో రైతును నిలువునా మోసం చేస్తున్నారు. ఇక్కడ వ్యాపారులే ఒకో చోట ఒక్కో ధరతో వినియోగదారులకు విక్రయిస్తుంటారు.



ఏదీ వినియోగం

అనంత నగరంలోని లలిత కళాపరిషత్తు వద్ద గత తెదేపా ప్రభుత్వ హయాంలో రైతుబజారును ఏర్పాటు చేశారు. మొత్తం 32 స్టాల్స్, 20 దుకాణాలు.. డిజిటల్ ధరల బోర్డు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఉంది. ఎస్టేట్ అధికారితో పాటు 4 నుంచి 5 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అన్ని వసతులు ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగంలో లేదు. బయట వ్యక్తులు ఉదయం, సాయంత్రం వేళ్లలో కాలక్షేపం చేస్తుంటారు.



పశువుల షెడ్డుగా మారి..

హిందూపురంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ మార్గంలో రూపుకోల్పోయిన రైతుబజారు ఇది. గత తెదేపా హయాంలో నిర్మించారు. ప్రస్తుతం వినియోగంలో లేకపోవడంతో స్థానికులకు పశువుల షెడ్డుగా మారిపోవడం గమనార్హం.



రహదారే.. మార్కెట్

హిందూపురంలోని పెనుకొండ మార్గంలో రహదారిపైనే సాగుతున్న కూరగాయల విక్రయాలు. కొనుగోలు చేయాడానికి వినియోగదారులు నానా తంటాలు పడాల్సిన దుస్థితి నెలకొంది.

నిర్మాణానికి ప్రతిపాదనలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత తెదేపా సర్కారు హయాంలో గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి, ధర్మవరం పట్టణాల్లో రైతుబజార్లు నిర్మించాలని జిల్లా మార్కెటింగ్‌శాఖ ప్రతిపాదించింది. గుంతకల్లులో నిర్మాణాలు చేపట్టినా అసంపూర్తిగా ఉంది. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఒకటి చొప్పున రైతుబజారు నిర్మించాలని మళ్లీ మార్కెటింగ్‌శాఖ ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఈక్రమంలో తెదేపా కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. ప్రతి మున్సిపాలిటీలో రైతుబజారు అందుబాటులోకి తెచ్చి.. వాటిని సక్రమంగా నిర్వహిస్తే రైతులు, వినియోగదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

స్థలాల కోసం అన్వేషిస్తున్నాం

రైతుబజారుకు కనీసం 25 సెంట్ల స్థలం అవసరం. పట్టణాల్లో స్థలాలు దొరకడం లేదు. ఆయా మున్సిపాలిటీల్లో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు విజ్ఞాపనలు అందజేశాం. గుంతకల్లులో రైతుబజారు పూర్తి చేయడానికి రూ.10 లక్షలు అవసరం. అనంతపురంలో మరోచోట రైతుబజారును నిర్మించాల్సి ఉంది. **- సత్యనారాయణచౌదరి, ఏడీఎం, అనంతపురం**



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ ఇన్‌ఛార్జి వీసీ సుదర్శనరావు

సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణ పరిరక్షణ

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ కోసం మెంబ్రేషన్ ప్రాసెస్‌లు, ప్రస్తుత పరిస్థితి, సవాళ్ల అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య సుదర్శనరావు హాజరయ్యారు. ప్రారంభోపన్యాసం చేస్తూ పర్యావరణ స్థిరత్వం ముఖ్యమన్నారు. మార్పులు రాకుండా ఉండాలంటే మెంబరిన్ టెక్నాలజీ ఉపయోగించాలన్నారు. ఐఎంఎస్ అధ్యక్షుడు మూర్తి మాట్లాడుతూ.. ఇండియన్ మెంబరిన్ సొసైటీ 1987లో స్థాపించారన్నారు. ఈ సొసైటీ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త శ్రీధర్ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నియంత్రించడం కోసం కార్బన్ డై ఆక్సైడ్ తగ్గించాలన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

రాష్ట్రస్థాయి పోటీలకు రైఫిల్ షూటర్ల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో అనంతలక్ష్మి పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్-14, 17, 19 విభాగాల్లో పలువురు నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 10 మీ. రైఫిల్ షూటింగ్‌లో బి. రిత్విక్ సాయిచరణ్‌రెడ్డి, టి.రితికలు రాజమహేంద్రవరంలో జరగనున్న రాష్ట్రస్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో బి.కౌశిక్ సాయిచరణ్‌రెడ్డి, ప్రజ్ఞలు, అండర్-19 విభాగంలో శ్రీజారెడ్డిలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

విద్యార్థులకు అపార్

డిజిటల్ కార్డుల జారీకి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు

రాయదుర్గం పట్టణం, అనంతపురం విద్య, కొత్తచెరువు, న్యూస్‌టుడే: ఆధార్ తరహాలో విద్యార్థులకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డులు జారీ చేయనున్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి అపార్ అందించనున్నారు. వన్ నేషన్ - వన్ స్టూడెంట్ నినాదంలో భాగంగా కేంద్ర విద్యాశాఖ అపార్ కార్డుల జారీకి శ్రీకారం చుట్టింది. కేజీ నుంచి పీజీ వరకు చదివే ప్రతి విద్యార్థికి గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది.

ఒక్క స్కానింగ్‌తో అన్ని వివరాలు

అపార్ కార్డులో విద్యార్థి పేరు, పుట్టిన తేది, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, 12 అంకెల గుర్తింపు సంఖ్య, మార్కులు, గ్రేడ్లు, ఉపకార వేతనాల వివరాలు, క్రీడలు, ఇతర అంశాల్లో సాధించిన విజయాలతో పాటు వ్యక్తిగత, విద్యా సంబంధిత వివరాలన్నీ ఉంటాయి. స్కాన్ చేయగానే మొత్తం వివరాలను తెలుసుకునేలా దీన్ని రూపొందించారు. ముందుగా 9-12 తరగతుల వారికి ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో 9, 10 తరగతులు చదువుకుంటున్న విద్యార్థులకు ఈ కార్డులు జారీ చేసేందుకు మార్గదర్శకాలు విడుదల చేశారు.

తప్పనున్న అవస్థలు

ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, కేంద్రీయ విశ్వవిద్యాలయంతో పాటు డిగ్రీ, పీజీ చదువుతున్నారు. రాష్ట్ర నిబంధనల ప్రకారం ఇక్కడి విద్యార్థులకు మాత్రమే ఉపకార వేతనాలు అందిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు ఇప్పటి వరకు ఇబ్బంది పడేవారు. వారంతా సొంత రాష్ట్రాల్లో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేయాలనుకుంటే చదువుతున్న ప్రాంతంలో ధ్రువపత్రాలు తీసుకురావాలి. దాంతో చాలా మంది విద్యార్థులు అక్కడి నుంచి ఇక్కడికి, ఇక్కడి నుంచి అక్కడికి తిరగాల్సి వచ్చేది. అపార్ కార్డుల జారీతో కష్టాలు తప్పనున్నాయి. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు యూడైస్ వెబ్‌సైట్‌లో పెన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబరు) ఉంది. దీని ఆధారంగానే విద్యార్థుల ప్రవేశాలు, టీసీలు జారీ చేస్తున్నారు. ఇదే తరహాలోనే ఇకపై అపార్‌తో అన్ని కార్యకలాపాలు నిర్వహిస్తారని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి అనంత జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, విద్యార్థుల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	3,243
ప్రాథమికోన్నత..	502
ఉన్నత పాఠశాలలు:	1,539
1-8వ తరగతి వరకు విద్యార్థులు :	3,57,363
9, 10వ తరగతి చదువుతున్న వారి సంఖ్య:	87,897
ఇంటర్మీడియట్ విద్యార్థుల సంఖ్య :	20,555



అపార్ కార్డు నమూనా

ఎక్కడి నుంచైనా ప్రవేశాలు

'అపార్'తో ఎక్కడి నుంచైనా ప్రవేశాలు పొందవచ్చు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే గుర్తింపు సంఖ్య ఆధారంగా అపార్ కార్డులో విద్యార్థి బ్యాంకు ఖాతా నంబరు, డీజీ లాకర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఈ కార్డులను జారీ చేసే ముందు కేంద్ర ప్రభుత్వ అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ)ని ప్రారంభించింది. డీజీ లాకర్ ద్వారా వివరాలు నమోదు చేస్తే విద్యార్థి పేరుతో సహా అపార్ కార్డు వస్తుంది. దీన్ని నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీని ద్వారా వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రవేశ పరీక్షల్లో వివరాల నమోదు, ధ్రువీకరణ తదితర పనుల్నీ సులువుగా పూర్తవుతాయి. ఇకపై ఉపకార వేతనాల మంజూరు, ఉద్యోగాల భర్తీ, ఇతర సందర్భాల్లో ఇదే కీలకం కానుంది. ఈ విధానంపై ఇప్పటికే అధికారులకు అవగాహన కల్పించారు.



ప్రార్థనల్లో ఎస్పీ జగదీశ్ తదితరులు

ఘనంగా గ్యార్మీ వేడుకలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని మహబూబ్ సుబహాని దర్గాలో బుధవారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ జగదీశ్ దర్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులకు సంబంధించిన ప్రార్థనా మందిరాలు డీపీవోలో ఉండటం గొప్ప విషయమన్నారు. ఆయా మతాలకు సంబంధించిన ముఖ్యమైన పర్వదినాలు జిల్లా పోలీసు శాఖ ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అందరూ కలిసి మెలిసి హోదాలు మరచి నిమగ్నం కావడం, భోజనం చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ రమణమూర్తి, ఏఆర్ అదనపు ఎస్పీ మునిరాజ, డీఎస్పీలు శ్రీనివాసరావు, రవికుమార్, మహబూబ్ బాషా, సీఐలు క్రాంతికుమార్, శ్రీకాంత్,శాంతిలాల్, ప్రతాప్‌రెడ్డి, దేవానంద్, ఆర్ఐ రాముడు, లీగల్ అడ్వయిజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం నాయకులు త్రిలోక్, జాఫర్ పాల్గొన్నారు.

ఆలోచన అంకురం.. అతివలే సారథ్యం

● ఉద్యోగాల కల్పన దిశగా స్టార్టప్‌లు ● అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం శిక్షణతో ముందుకు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉద్యోగం కోసం ఎదురుచూడడం కాకుండా ఉద్యోగాలు కల్పించే దిశగా పలు రంగాల్లో మహిళల ఆలోచనా విధానం ఉంటోంది. అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంలో అలా శిక్షణ పొందిన మహిళలు తమ సత్తా చాటుతున్నారు. 2018లో ఏర్పడిన ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం 900 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఆలోచనల్ని సేకరించింది. అందులో 40 శాతం ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఉండటం విశేషం. వీరంతా ఎస్కేయూ- ఏఐసీలోని నిపుణుల శిక్షణ, సూచనలు, సలహాలు, సహకారంతో స్టార్టప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అలా మహిళలు ఏర్పాటు చేసిన కొన్ని స్టార్టప్‌లకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బహుమతులు దక్కాయి.

● అంకుర సంస్థలు ఒకప్పుడు నగరాలకే పరిమితమయ్యేవి. ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ గ్రామీణ ప్రాంతాలపై దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలు, రైతాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించే దిశగా సాంకేతిక పరిజ్ఞానంతో ఇన్నోవేషన్, స్టార్టప్‌ల స్థాపనకు కృషి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిన స్టార్టప్ ఇవే..




ఎస్కేయూలోని అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం

రేడియాలజీలో సాంకేతిక విధానం

● స్టార్టప్ : డీప్ ఇన్ఫినిటీ ఏఐ ● రూపకర్త పేరు: రమ

అంకుర సంస్థ పనితీరు : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ ఇది. రోగులు తీయించుకున్న ఎక్స్‌రే, స్కానింగ్ పిక్చర్లను జోడించాలి. రేడియాలజిస్ట్ రాసే రాతలు, చెప్పే భాష చాలా మందికి అర్థం కాదు. ఈ సాఫ్ట్‌వేర్ ఆధారంగా ఆ వివరాలు సులువుగా అర్థమయ్యేలా నివేదిక అందిస్తుంది. ఎస్కేయూ సమీపంలో దీన్ని వినియోగిస్తున్నాం. చిన్నచిన్న పట్టణాల్లో వైద్యులు కూడా గుర్తించని వ్యాధుల వివరాలను సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. యూకే నుంచి వచ్చిన ఎక్స్‌రే, స్కానింగ్ నివేదికల రూపకల్పనకు తోడ్పాటు అందిస్తున్నాం. కొన్ని సంవత్సరాల్లో దీన్ని ఆసుపత్రుల్లో ఉపయోగించేలా కృషి చేస్తాం **- రమ**



సిబ్బందితో చర్చిస్తున్న రమ

గ్రామీణుల ఆరోగ్య సంరక్షణకు కృషి

● **స్టార్టప్ : సోనిక్ ఏ టు బీ సొల్యూషన్**
● **రూపకర్తలు : అఖిల, ఆషాక్రాంతి, బేబీశ్రీ**

అంకుర సంస్థ పనితీరు : గ్రామీణ ప్రజలు రోగాల బారిన పడితే వారు వైద్య పరీక్షలకు పట్టణాలకు వెళ్లాల్సిందే. పట్టణాలలోని వైద్య ప్రయోగశాలలో రక్తపరీక్షలు చేయించుకొని డాక్టరును సంప్రదించడానికి ఒకరోజు పడుతుంది. రక్తపరీక్షల ఫలితాలు రావడానికి ఆలస్యమైతే రెండోరోజు కూడా వెళ్లాల్సిన పరిస్థితి. గ్రామీణులకు ఈ వ్యవహారం ఎంతో వ్యయ, ప్రయాస. గ్రామీణులకు వైద్యం అందేలా మొబైల్ డయాగ్నస్టిక్ ఏర్పాటు చేసేలా వారి ఆలోచనలకు ఇంక్యుబేషన్ సెంటర్ సహకారం అందించింది. ప్రస్తుతం వారు వ్యాన్‌లో డయాగ్నస్టిక్ యంత్రాలు అమర్చారు. గ్రామీణ ప్రాంతాల్లోకెళ్లి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించి రిపోర్ట్ కూడా అందజేస్తున్నారు. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో రోగులకు అవసరమైన పరీక్షలు అందిస్తున్నారు. గ్రామీణులకు మొబైల్ డయాగ్నస్టిక్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తూ వీరు ఉపాధి పొందుతున్నారు. థాయ్‌లాండ్‌లో జరిగిన అంకుర సంస్థ పోటీలకు వారు ఎంపికయ్యారు. వారికి ఇన్నోవేషన్ క్రియేటివ్-2024లో అవార్డు దక్కింది.

● తమ స్టార్టప్‌కి అంతర్జాతీయస్థాయి గుర్తింపు దక్కింది. ఈ విజయానికి ఎస్కేయూ- ఏఐసీ ఎంతో సహకారం అందించింది. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ డయాగ్నస్టిక్ ద్వారా ఏ టు బీ సొల్యూషన్ పేరుతో పరీక్షలు నిర్వహించి గ్రామీణ ప్రజల రక్షణకు కృషి చేస్తున్నాం. **- అఖిల, ఆషాక్రాంతి, బేబీశ్రీ**



అవార్డు అందుకున్న అఖిల, ఆషాక్రాంతి, బేబీశ్రీ

పీజీ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వివిధ పీజీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లకు తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు సంచాలకులు ఆచార్య జి.నరసింహన్ తెలిపారు. ఈ నెల 19న నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. పీజీ సెట్-2024లో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో అడ్మిషన్ల విభాగానికి హాజరు కావాలన్నారు. ఫీజులు ఆరోజే పూర్తిగా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

'పేదల కడుపు కొట్టిన వైకాపా ప్రభుత్వం'



అన్న క్యాంటీన్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయరాం, తదితరులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వం ముందు వెనుకా ఆలోచించకుండా అన్న క్యాంటీన్‌లను మూసివేసి పేదల కడుపుకొట్టిందని గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం దుయ్యబట్టారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఎక్కువ డబ్బులు వెచ్చించి హోటళ్లకు వెళ్లి భోజనం చేసే పరిస్థితి పేదలకు లేదని, దీన్ని దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరకు రుచికర భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. మున్సిపల్ అధికారులు క్యాంటీన్ నిర్వహణను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయూం అహ్మద్, తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పట్టణ అధ్యక్షుడు ఆనంద్, తెదేపా నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, కష్టారెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే పుట్టినరోజు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు భవాని, తెదేపా వైద్యుల విభాగం జిల్లా అధ్యక్షురాలు హిమబిందు, నాయకుడు ప్రతాప్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం క్లబ్ ఎన్నికలపై సందిగ్ధం

తపోవనం (అనంతపురం) న్యూస్‌టుడే: అనంతపురం క్లబ్ ఎన్నికలపై ఇంకా సందిగ్ధం వీడలేదు. ఆగస్టులో జరగాల్సిన ఎన్నికలు కలెక్టర్ ఆదేశాలతో నిలుపుదల చేశారు. క్లబ్‌లో జరిగే కార్యకలాపాలు, ఆడిట్ నివేదికలు, కొందరి సభ్యులకు సంబంధించి ఓటు హక్కు తొలగింపు తదితర అంశాలపై ఆర్డీఓ, తహశీల్దార్లు విచారణ చేశారు. ఈ విచారణకు సంబంధించి ఇంకా ఎలాంటి నిర్ణయం ప్రకటించకపోవడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అనంతపురం క్లబ్ అధ్యక్షుడిగా కలెక్టర్, ఉపాధ్యక్షుడిగా ఎస్పీ వ్యవహరిస్తారు. ఒక కార్యదర్శి, ఇద్దరు సంయుక్త కార్యదర్శులు, ఆరుగురు ఈసీ సభ్యులను ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారు. రెండేళ్ల క్రితం క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రెండేళ్ల పదవీకాలం ముగియగానే గత ఆగస్టులో పాలకవర్గం ఎన్నికల అధికారులను నియమించి ప్రకటన విడుదల చేశారు. అధికార పార్టీ నాయకులు కొందరు కలెక్టర్‌పై ఒత్తిడి తెచ్చి ఎన్నికలను వాయిదా వేయించారు. క్లబ్ సీనియర్ సభ్యుల ఫిర్యాదు మేరకు అధికారులు సమగ్ర విచారణ జరిపారు. ఆ విచారణ పూర్తయి రెండు నెలలు దాటినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కొందరు సభ్యులు అడహాక్ కమిటీ వేయాలని పట్టుబడుతున్నారు. అడహాక్ కమిటీ నియమించాలంటే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సభ్యులు రజాక్, లక్ష్మన్నలు అడహాక్ కమిటీ కోసం సర్వసభ్య సమావేశానికి పిలుపునిచ్చారు. ఈ నిర్ణయం వివాదాస్పదంగా మారింది. ప్రస్తుత ఇన్‌ఛార్జి క్లబ్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి ఆ ఇద్దరు సభ్యులు నిర్వహించ తలపెట్టిన సర్వసభ్య సమావేశం నిబంధనల ప్రకారం చెల్లదని తెగేసి చెబుతున్నారు. కార్యదర్శి కేశవరెడ్డి ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. ఆయన వచ్చిన తర్వాత సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం ముగిసిన కారణంగా అడహాక్ కమిటీని నియమించాలని కొందరు కోరుతున్నారు. అడహాక్ కమిటీని నియమించే అధికారం ఎవరికి ఉందో కలెక్టర్ తేల్చాల్సి ఉంది.

వైభవ్ జ్యువెలరీ షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌లో ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఏపీ ఐజీ అంజనాసిన్హా, నిర్వాహకులు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: అనంతపురం నగరం రాజు రోడ్డులో వైభవ్ జ్యువెలరీ షోరూమ్‌ను ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఏపీ ఐజీ అంజనా సిన్హా ప్రారంభించారు. మొదటగా జ్యోతి వెలిగించి షోరూమ్‌లో ఉన్న వివిధ రకాల నగలను పరిశీలించారు. వైభవ్ జ్యువెలరీ 16వ షోరూమ్‌ను నగరంలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఉత్తమ నాణ్యత, అనువైన ధరలతో విభిన్న రకాల డిజైన్లలో బంగారు ఆభరణాలు ఉన్నాయన్నారు. అనంత నగర ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భాజపా యువ మోర్చా అధ్యక్షుడు వంశీకృష్ణ, ఐటీసీ డీలర్ సుబ్బరాయుడు, వైభవ్ సంస్థల ఎండీ భారత మల్లిక రత్నకుమారి, డైరెక్టర్లు కీర్తన, రాఖాల్, సింధూరి వెంకటేశ్, అమరేంద్ర, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

'పరస్పర సహకారంతో అభివృద్ధి'



క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీతతో మాట్లాడుతున్న దగ్గుపాటిప్రసాద్

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే: రాప్తాడు, అనంతపురం అర్బన్ నియోజకవర్గాల పరిధిలోని కాలనీలు, గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం పరస్పర సహకారంతో కలిసి అభివృద్ధి అడుగులు వేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పునరుద్ఘాటించారు. బుధవారం అనంతపురం నగరం అరవిందనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఇరువురు ఎమ్మెల్యేలు భేటీ అయ్యారు. అనంతపురం గ్రామీణం కాలనీలు, రాప్తాడు మండలం బండమీదపల్లి పంచాయతీ అభివృద్ధి పనులపై గంటపాటు చర్చించారు. ప్రధానంగా ఇరువురు ఎమ్మెల్యేల పరిధిలో కాలనీలు, గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయని, అందులో నడిమివంక పరిసర ప్రాంతాలు ముంపునకు గురికాకుండా వంకకు రక్షణ గోడలు నిర్మాణాలు చేపట్టాలని సునీత దగ్గుపాటిప్రసాద్‌కు సూచించారు. రాప్తాడు మండలం ఎం.బండమీదపల్లి సొంత గ్రామమని, అది రాప్తాడు నియోజకవర్గం పరిధిలోకి వస్తోందని, ఈ పంచాయతీలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని దగ్గుపాటి ప్రసాద్ కోరారు.

జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని సుందరయ్యనగర్ శివార్లలో బండల చేను వద్ద బుధవారం 11 మంది జూదరులను రెండో పట్టణ సీఐ రెడ్డెప్ప అరెస్టు చేశారు. బండల చేను ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో రెడ్డెప్ప ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 11 మందిని అరెస్టు చేసి రూ.1,16,750 నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి యువరైతు బలి



అంజినప్ప

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన అంజినప్ప (27) అనే రైతు బుధవారం విద్యుదాఘాతంతో మృతిచెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. అంజినప్పకు 1.5 ఎకరాల భూమి ఉంది. వ్యవసాయం చేస్తూ, కూలీ పనుల ద్వారా భార్య సులోచన, మూడేళ్ల లోపు వయసు ఉన్న ఇద్దరు కుమార్తెలు దీక్షిత, హర్షితలను పోషిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పొలంలో విద్యుత్తు మోటార్‌ను ఆఫ్ చేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త మృతితో భార్య తమకు దిక్కెవరంటూ పిల్లలను అనాథలు చేశావని కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు - లారీ ఢీ

క్షతగాత్రులను కాపాడిన స్థానికులు

యాడికి, న్యూస్‌టుడే : యాడికి మండలంలోని 67వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నలుగురిని బాటసారులు, స్థానికులు తక్షణం స్పందించి కాపాడారు. తాడిపత్రికి చెందిన రాఘవ, శ్రీధర్, సుదర్శన్‌రెడ్డి, సూర్య కలిసి కారులో గుత్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో వేములపాడు సమీపాన లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో గుత్తి వైపు నుంచి గ్రానైట్ లోడుతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. వాహనం నడుపుతున్న శ్రీధర్ కారులో ఇరుక్కుపోయారు. ముందు సీట్‌లో ఉన్న ఇద్దరు ఆర్తనాదాలు చేశారు. ఆ మార్గంలో వెళ్తున్న వాహన చోదకులు, స్థానికులు స్పందించారు. కారులోంచి అతికష్టం మీద క్షతగాత్రులను పది నిమిషాల వ్యవధిలో బయటకుతీశారు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని ప్రత్యేక వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులైన రాఘవ, సుదర్శన్‌రెడ్డి, సూర్యను 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జయిన కారు నుంచి క్షతగాత్రులను బయటకు తీస్తున్న స్థానికులు

విభాగినిని ఢీకొని మహారాష్ట్ర వాసి మృతి

తాడిపత్రి: తాడిపత్రిలోని సీబీ రోడ్డుపై ఉన్న విభాగినిని (డివైడర్‌ను) ఢీకొని మహారాష్ట్ర వాసి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్రకు చెందిన అనిల్‌కుమార్ (29) ఉపాధి నిమిత్తం ఇటీవల తాడిపత్రికి వచ్చాడు. నందలపాడులో నివాసం ఉంటూ ఐస్‌క్రీం అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం రామచంద్రలాడ్జి సమీపాన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అతను మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి విభాగినీని ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అనిల్‌కుమార్‌కు భార్య అబుల్‌దేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

డ్రైవర్ నిద్రమత్తు.. బస్సు బోల్తా

తప్పిన ప్రమాదం.. 10 మందికి గాయాలు



బోల్తాపడిన ప్రైవేట్ బస్సు

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని జాతీయ రహదారి-44పై ప్రైవేట్ బస్సు బోల్తాపడి 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి బెంగళూర్ వెళ్తున్న వీవీఎస్ఆర్ ట్రావెల్స్ బస్సు హంపాపురం సమీపాన ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలో తెల్లవారుజామున 4 గంటల సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో డివైడర్ ఎక్కించడంతో బస్సు బోల్తా పడింది. బస్సులో 60 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. బస్సు వెనుక భారీ వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తెల్లవారుజామున రాప్తాడు సీఐ శ్రీహర్ష చేరుకొని గాయపడ్డ ప్రయాణికులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ లేకుండా చూశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో ఎస్పీ జగదీశ్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, చోరీలు నివారించాలని, పోలీసు యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేయాలని కోరారు. ప్రత్యేక నిఘా ఉంచి శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఎస్పీ చెప్పారని ఎమ్మెల్యే వివరించారు.



ఎస్పీ జగదీశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ఆర్‌ఐ బాధ్యతల స్వీకరణ

కుందుర్పి, న్యూస్‌టుడే: మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా పోతన్న బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్నాళ్లుగా ఆర్‌ఐ పోస్టు ఖాళీగా ఉంది. వజ్రకరూరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న పోతన్నను ఇక్కడ ఆర్‌ఐగా నియమించారు.

రాయితీ పప్పుసెనగ విత్తన పంపిణీ

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ, దర్గాహొన్నూరు, ఉంతకల్లు గ్రామాల్లో 408 మంది రైతులకు 300 క్వింటాళ్ల రాయితీ పప్పుసెనగ విత్తనాలను పంపిణీ చేసినట్లు ఏవో సాయికుమార్ తెలిపారు. మండలంలో 1300 హెక్టార్లలో పంట సాగవుతున్నట్లు అంచనాతో మండలానికి 500 క్వింటాళ్లు మంజూరు కాగా 300 క్వింటాళ్లను పంపిణీ చేశామన్నారు. క్వింటాలుకు ప్రభుత్వం రూ. 2350 రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. నాయకులు సోమనాథ్‌గౌడ్, వేమన్న, వన్నూరుస్వామి, దేవేంద్రప్ప పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: కుందుర్పి మండలంలోని జానంపల్లి రహదారులపై అపరిశుభ్రత నెలకొంది. - **రామాంజనేయులు**

సమాధానం: కార్మికులతో శుభ్రం చేయిస్తాం. - **రఫీ, గ్రామ కార్యదర్శి**

సమస్య: మండలంలోని బెస్తరపల్లిలో తాగునీటి పైపునకు రంధ్రం ఏర్పడి వృథా అవుతున్నాయి. - **గంగాధర**

సమాధానం: మరమ్మతులు చేయిస్తాం. - **దీపికా, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు**

సమస్య: మహంతపురంలో శుద్ధజలం ట్యాంకు నిరుపయోగంగా ఉంది. **గ్రామస్థులు**

సమాధానం: పరిశీలించి ఉపయోగంలోకి తెస్తాం. - **బాలాజీ, ఈఓఆర్డీ**

సమస్య: నాగిరెడ్డిపల్లి నుంచి భైరసముద్రం వెళ్లే రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **సోము**

సమాధానం: తొలగించి ఇబ్బంది కలగకుండా చూస్తాం. - **అనిల్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: గొంచిరెడ్డిపల్లి బస్టాండు వద్ద ప్రధాన రహదారిపై మురుగు నిల్వతో ఇబ్బందిగా మారింది. - **మల్లయ్య**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. - **కవిత, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: వేపులపర్తిలోని ప్రధాన రహదారి పక్కన మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. - **నాగరాజు, వేపులపర్తి**

సమాధానం: పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపడుతాం. - **వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, కుందుర్పి, బ్రహ్మసముద్రం

చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసా

పీఎం ఆత్మనిర్భర్ యోజన రుణాలు

పట్టణంలో గుర్తించిన వీధి వ్యాపారులు : 1,553 మంది	రూ.20వేలు రుణం పొందిన వారు : 483
రూ.10వేలు రుణం పొందిన వారు : 1,447	రూ.50వేలు రుణాలు పొందిన వారు : 101

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆత్మ నిర్భర్ యోజనా పథకం కింద వీధి వ్యాపారులు రుణాలు పొంది ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. మెప్మా పరిధిలో స్త్రీ, పురుషులు రూ.10 వేల నుంచి రూ.50వేల దాకా రుణాలు పొంది వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నారు. పండ్లు, కూరగాయలు, దుస్తులు, హోటళ్లు తదితర చేతివృత్తుల వారు ఈ పథకం కింద రుణాలు పొందుతున్నారు.

గుర్తింపు ఇలా: మొదట వీధి వ్యాపారులను గుర్తిస్తారు. ఆ తర్వాత వారి పేర్లపై బ్యాంకుల్లో జీరో, సొంత ఖాతాలు ప్రారంభిస్తారు. అనంతరం గుర్తింపు కార్డులు మంజూరు చేస్తారు. బ్యాంకర్లకు దరఖాస్తులు పంపి వారి వ్యాపారాలను బట్టి మొదట రూ.10వేలు రుణం మంజూరు చేయిస్తారు. ఏడాదిలోగా వాటిని సక్రమంగా చెల్లిస్తే రూ.20వేలు, ఆ తర్వాత రూ.50వేల దాకా మంజూరు చేస్తారు. వాటిని వ్యాపారులు సక్రమంగా చెల్లిస్తే బ్యాంకర్లు వ్యక్తిగతంగా ఎక్కువ రుణాలు మంజూరు చేసే అవకాశం ఉంది.



పండ్లు విక్రయిస్తున్న గంగమ్మ

వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి

వీధి వ్యాపారులు తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు బయట ఎక్కువ వడ్డీకి రుణాలు తీసుకునేవారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీ వ్యాపారులు, ఫైనాన్సర్లు, బీటీలు వ్యాపారులు వందకు రూ.2నుంచి రూ.10 దాకా వసూలు చేసేవారు. ప్రస్తుతం పీఎం ఆత్మనిర్భర్ యోజనా పథకం కింద రుణాలు మంజూరు చేస్తుండటంతో వడ్డీ వ్యాపారులకు చెక్ పెట్టారు. బ్యాంకర్ల ద్వారా వందకు 90పైసలు వంతున రుణాలు మంజూరు చేస్తున్నారు. రుణం చెల్లించిన తర్వాత 0.60శాతం వడ్డీని కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారులకు చెల్లిస్తుంది.

గ్రామాల్లో పూడికతీత

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని బండూరు, ఉద్దేహాళ్ గ్రామాల్లో ముంపునకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ మునివేలు, ఈవోఆర్డీ దాస్ తెలిపారు. బుధవారం పూడిపోయిన కాలువలను పొక్లెయిన్‌తో శుభ్రం చేయించారు. గ్రామాల్లో ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శివన్న, వీఆర్వోలు యుగంధర్, ఉద్దేహాళ్ గ్రామ తెదేపా నాయకులు పాల్గొన్నారు.



పొక్లెయిన్‌తో పూడికతీత పనులు చేపడుతున్న అధికారులు

ఆస్పత్రికి కుర్చీలు, సౌర దీపాల వితరణ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రెన్యూ ప్రైవేట్ గాలిమరల కంపెనీ వారు కుర్చీలు, సోలార్ దీపాలు బుధవారం అందజేశారు. గతంలో శుద్ధజల ప్లాంటును ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం రూ.20 వేల విలువ చేసే మూడు కుర్చీలు చొప్పున (15 జతలు), ఒక్కో సోలార్ దీపం రూ.30 వేలు చొప్పున 10 దీపాలు అందజేశారు. వైద్యులు, రోగులు ఇబ్బంది పడకుండా తమవంతుగా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కంపెనీ ప్రతినిధులకు పలువురు అభినందనలు తెలియజేశారు.

నిరుపయోగంగా శీతల యంత్రం



కుందుర్పిలోని 2వ రైతు సేవా కేంద్రంలో శీతల యంత్రం గత ఎనిమిది నెలలుగా నిరుపయోగంగా ఉంది. రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు చెందిన పశువులు, గొర్రెలు, ఇతర జంతువులకు ఏదైనా వ్యాధులు సంక్రమిస్తే అత్యవసరంగా వినియోగించే ఖరీదైన మందులు, ఇంజక్షన్లు నిల్వ చేసేందుకు వీలుగా పశుసంవర్ధక శాఖ తరఫున రూ.లక్షలు వెచ్చించి రిఫ్రిజిరేటర్లను కొనుగోలు చేశారు. ప్రస్తుతం యంత్రాన్ని నిరుపయోగంగా ఉంచారు. సంబంధిత అధికారులు స్పందించి దాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, కుందుర్పి**

సత్ప్రవర్తనతోనే సమాజంలో గౌరవం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మార్పు తెచ్చుకొని సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ ఖైదీలకు సూచించారు. బుధవారం స్థానిక సబ్ జైల్లో ఖైదీల గదులు, సౌకర్యాలు, భోజనాలు తనిఖీ చేసి వసతులు పరిశీలించారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడుతూ.. పట్టుదల, పౌరుషానికి వెళ్లడంతోనే జైలుకు వచ్చారన్నారు. చిన్నపొరపాట్లతో మీ కుటుంబ సభ్యులు ఎన్నో ఇబ్బందులు పడుతుంటారనేది గుర్తించుకోవాలని చెప్పారు. బయటకు వెళ్లిన తరువాత మంచి నడవడికతో ఉండాలన్నారు. న్యాయసేవాధికార సంస్థ తరపున న్యాయవాదులను నియమిస్తామని వివరించారు. న్యాయవాదులు దాదాఖలందర్, రామాంజనేయులు, హెడ్ వార్డెన్ నారాయణరెడ్డి, వార్డర్ అంజినాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్‌యాదవ్

పల్లెల ప్రగతే ధ్యేయం



ఉరవకొండ: కొట్టాలపల్లిలో భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సర్పంచులు ఉమాదేవి, తిప్పారెడ్డి, నాయకులు రవీంద్ర, లోకేశ్, ఎంపీడీవో మహేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని వ్యాసాపురం, విడపనకల్లు మండలంలోని పెద్ద కొట్టాలపల్లి, వేల్పుమడుగు గ్రామాల్లో 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

కుందుర్పి: 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెస్తరపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. పండ్ల తోటల పెంపకం కోసం రైతులకు మొక్కలు అందజేశారు. గోకులం షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో బాలాజీ, మాజీ సర్పంచి రామచంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: మండలంలోని దురదకుంటలో 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా ఉపాధి ఏపీవో పుష్పవతి నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ప్రభుత్వ పథకాలు, ఇతరాత్ర వాటిపై వివరించారు. టీపీ గురుప్రసాద్, నాయకులు చెన్నమల్ల చౌదరి, దొణతిమ్మ, చంద్రశేఖర్‌చౌదరి, శశికాంత్, జయన్న, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కుందుర్పి: పండ్లతోటల పెంపకాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బెళుగుప్ప: మండలంలోని శీర్పి, గంగవరం గ్రామాల్లో 'పల్లె పండగ' కార్యక్రమం నిర్వహించారు. సీసీ రహదారులకు ఎంపీడీవో లక్ష్మీనారాయణ, తెదేపా నాయకులు సునీల్, వీరాంజి, జయరాములు తదితరులు భూమి పూజ చేశారు. ఏపీవో సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు చేయరూ!



పట్టణంలోని జేబీఆర్‌ఎస్ కాలనీలో గత రెండేళ్లుగా దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. గతంలో నాసిరకంగా నిర్మించిన కల్వర్టు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలిపోతుండటంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ దివాకర్‌రెడ్డిని వివరణ కోరగా. . పట్టణంలో దెబ్బతిన్న కల్వర్టులను గుర్తించి దశలవారీగా కొత్తవి నిర్మిస్తామని తెలిపారు. - **న్యూస్‌టుడే, రాయదుర్గం**

విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం



నియంత్రికను ధ్వంసం చేసిన దుండగులు

విడపనకల్లు (ఉరవకొండ) : దుండగులు విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేసిన ఘటన విడపనకల్లు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. మంగళవారం రాత్రి రాష్ట్ర సరిహద్దు జాతీయ రహదారిలోని డొనేకల్లు వద్ద పోలీసు తనిఖీ కేంద్రం సమీపంలో ఇంధన దుకాణానికి చెందిన విద్యుత్తు నియంత్రికను దొంగలు ధ్వంసం చేశారు. అందులో విలువైన రాగి తీగలు, ఆయిల్‌ను అపహరించారు. అదే రహదారిలో పెంచలపాడు సమీపంలో జీబీసీ ఒడ్డున ఏర్పాటు చేసిన నియంత్రికనూ ధ్వంసం చేశారు. రాగి తీగలను ఎత్తుకెళ్లారు. విద్యుత్తు నియంత్రికల చోరీలు అధికమవుతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం జరిగినట్లు లైన్‌మెన్లు తెలిపారు. విడపనకల్లు విద్యుత్తు ఏఈఈ సత్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరికరాలు లేవు.. పనులెలా చేయాలి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణ పరిశుభ్రతకు పరికరాలు లేకపోతే విధులు ఎలా నిర్వహించాలంటూ పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని ప్రశ్నించారు. బుధవారం వారి సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. చెత్త తొలగింపునకు చీపుర్లు, పారలు, గంపలు, తోపుడు బండ్లు లేవన్నారు. పరికరాలను వెంటనే సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఈపీఎఫ్‌ను సక్రమంగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, నెలనెలా వేతనాలు, మృతిచెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు, ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే కార్మికులకు టీఏ, డీఏలు, పంప్‌హౌస్‌లో పనిచేసే వారికి బ్యాటరీలు ఇవ్వాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాము, కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న కార్మికులు

నిబంధనల ప్రకారమే వసూలు చేయాలి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: వేలం పాటలో అధికంగా పాడుకున్నామని వ్యాపారులు, రైతుల నుంచి ఎక్కువ వసూలు చేయకూడదని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ తెలిపారు. బుధవారం 5 నెలల కాలానికి మున్సిపాలిటీ పరిధిలోని వారపు సంత, లారీ స్టాండ్, బస్టాండ్, రోడ్డు మార్జిన్‌కు వేలంపాట నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్, మేనేజర్ అశ్వర్థనారాయణ, పారిశుద్ధ్య అధికారి అలీఖాన్ ఆధ్వర్యంలో వేలంపాట జరిగింది. బస్టాండ్ రూ.71 వేలకు వన్నూరక్క, లారీ స్టాండ్ పవన్ రూ.2.72 లక్షలు, వారపు సంత లక్ష్మీదేవి రూ.1.22 లక్షలు, రోడ్డు మార్జిన్ రూ. 2 లక్షలకు వన్నూరస్వామి పాడుకున్నారు. మార్చిలో ఏడాదికి మళ్లీ బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.



వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ

జింక పిల్ల అప్పగింత

కళ్యాణదుర్గం గ్రామీణం: మండలంలోని పాలవాయిలో గొర్రెల మందలో ఉన్న జింక పిల్లను కాపర్లు గుర్తించారు. బుధవారం వీఆర్వో రాఘవేంద్ర రాజు ఆధ్వర్యంలో అటవీశాఖ బీట్ అధికారిణి రామేశ్వరమ్మకు అప్పగించారు. జింకపిల్ల వయసు రెండు నెలలు ఉంటుందన్నారు. అనంతరం పశువైద్యశాలకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేపట్టారు. దానిని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదులుతామని తెలిపారు.

22న ఉద్యోగ మేళా

రాయదుర్గం పట్టణం: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 22న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్, కోజెంట్ తదితర కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. పూర్తి వివరాలకు 9182920381 నంబరును సంప్రదించాలన్నారు.

సాగునీటి ప్రాజెక్టులతో అభివృద్ధి



కళ్యాణదుర్గం గ్రామీణం: మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాంభూపాల్

కళ్యాణదుర్గం గ్రామీణం, ఉరవకొండ, న్యూస్‌టుడే: జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. జిల్లాలో సాగు, తాగునీటి సాధనకు చేపట్టిన బస్సుయాత్ర బుధవారం రెండోరోజు కళ్యాణదుర్గం చేరుకొంది. ఆయకట్టు రైతులకు సాగునీరందించాలన్నారు. జీడిపల్లి నుంచి బీటీపీ వరకు మొదలుపెట్టిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 2018లో బీటీపీ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా 2 టీఎంసీల నీటిని మళ్లించేందుకు రూ. 450 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. జిల్లాలో రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి ఉన్నారని, ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించేలా చూడాలన్నారు. కళ్యాణదుర్గంలో ప్రారంభమైన బస్సుయాత్ర కాలువపల్లి, బెళుగుప్ప, ఉరవకొండలో సాగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాలరంగయ్య, జిల్లా సభ్యులు కృష్ణమూర్తి, అచ్యుత్‌ప్రసాద్, నాగమణి, చంద్రశేఖర్, మండల, పట్టణ కార్యదర్శులు రంగనాథ్, రఘు పాల్గొన్నారు.

జడివానతో జనం బేజారు



ఉరవకొండ: గడియార స్తంభం వద్ద వర్షపునీరు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలో బుధవారం ఎడతెరపి లేకుండా వర్షం కురవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వీధి వ్యాపారులు, వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రాయదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్థలం లేక డాక్యుమెంట్ రైటర్లు, రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వ్యాపార దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు వర్షం దెబ్బకు వెలవెలబోయాయి.

ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. పట్టణంలోని పలు వీధులు జలమయం అయ్యాయి. జనం రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రధాన వీధుల్లోని చిరు వ్యాపారులకు కష్టాలు తప్పలేదు. పట్టణ శివారు మూడు రోడ్ల కూడలిలో వర్షపునీరు నిల్వ ఉండడంతో ప్రమాదకరంగా మారింది.


కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం పట్టణంలో మోస్తారు వర్షం కురిసింది. కోట వీధి నుంచి మేడా వీధి గుండా వచ్చే కాలువ పొంగి పాత బస్టాండ్‌లోకి ప్రవహించాయి. జయనగర్, పార్వతీనగర్, రెవెన్యూ, దేవీరమ్మ తదితర కాలనీల్లో వర్షపునీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం): వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని బాదనహాళ్, పులకుర్తి, సోమలాపురం తదితర గ్రామాల్లోని వాగులు, వంకలు, వంతెనలను పరిశీలించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

గుంతకల్లు

●గుంతకల్లు ●శింగనమల ●తాడిపత్రి



గజవాహనంపై వేంకటరమణుడి వైభవం

తాడిపత్రి: తాడిపత్రిలోని చింతలరాయుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా కొనసాగాయి. శ్రీదేవి, భూదేవి సమేత చింతల వెంకటరమణస్వామిని పట్టువస్త్రాలతో అలంకరించి ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం గజవాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. తాడిపత్రిలోని వందన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

గుత్తి, న్యూస్‌టుడే : తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గుత్తి, గుత్తి ఆర్.ఎస్.లోని ముంపు ప్రాంతాల్లో బుధవారం కమిషనర్ జబ్బార్‌మియా, డీఈఈ హేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా పర్యటించారు. మురుగు కాలువల్లో పూడిక తీయించారు. ఇళ్లలోకి మురుగు, వర్షపు నీరు రాకుండా చర్యలు తీసుకున్నారు.

సజావుగా మండల సమావేశం


గుత్తి : గుత్తి మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ విశాలాక్షి ఆధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. గ్రామాలలో పారిశుద్ధ్యపనులు చేయించాలని కోరారు.

జేసీతో ఎమ్మెల్యే శ్రావణి భేటీ

తాడిపత్రి: తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణశ్రీ భేటీ అయ్యారు. ఇటీవల జేసీ ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో ఉండటంతో ప్రస్తుతం ఆమె పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే నియోజకవర్గంలో పలు సమస్యల గురించి జేసీతో చర్చించినట్లు తెలిసింది.

వరద బాధితులకు విరాళం అందజేత

గుంతకల్లు, న్యూస్‌టుడే : ఎస్ఎస్‌జీఎస్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, యాజమాన్యం సేకరించిన విరాళాలు రూ. 2.23 లక్షల చెక్కును బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ కళాశాల కరస్పాండెంట్ కె.సి. హరి అందజేశారు. తాము అందజేసిన సొమ్ము వరద బాధితులకు కొంత తోడ్పడుతుందని కరస్పాండెంట్ పేర్కొన్నారు. చెక్కును అందుకున్న ముఖ్యమంత్రి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారన్నారు.



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న కరస్పాండెంట్ కె.సి.హరి

దారులు తవ్వారు.. మరమ్మతులు మరిచారు



గుత్తి మెయిన్‌బజార్‌లో రహదారి ఇలా..

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి పట్టణంలో కుళాయి కనెక్షన్ల ఏర్పాటు కోసం సీసీ రోడ్లను ఇష్టానుసారంగా ధ్వంసం చేస్తుండటంతో రాకపోకలకు ప్రజలు, చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. కుళాయి కనెక్షన్ ఇచ్చేటప్పుడు డిపాజిట్‌తోపాటు రోడ్డు తవ్వుతున్నందుకు దాని మరమ్మతుల పేరుతో మున్సిపల్ అధికారులు సొమ్ము (రోడ్డు కటింగ్ ఫీజు) వసూలు చేస్తున్నారు. కుళాయి పైపులైన్ ఏర్పాటు చేస్తున్న సందర్భంలో సీసీ రోడ్లను తవ్వుతున్నారే కానీ.. వసూలు చేసిన సొమ్ముతో ఎక్కడా మరమ్మతులు చేయడం లేదు. అలా చేయకపోవడం వల్ల ఫలితంగా రహదారులు గోతులమయంగా మారాయి. దీంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్నారు. ఏటా మున్సిపాలిటీ పరిధిలో వందకు ప్రైవేట్ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. కనెక్షన్ ఇచ్చేటప్పుడు రోడ్డు కటింగ్ పేరుతో వసూలు చేసే సొమ్మును ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ధ్వంసమవుతున్న రోడ్లకు మరమ్మతులు చేయించక పోవడంతో గోతులు మరింత పెద్దవిగా మారుతున్నాయి. గుత్తిలోని బీసీ కాలనీ, పాత సీపీఐ కాలనీ, మెయిన్‌బజార్, కటిక వీధి, కోట, కొత్త సీపీఐ కాలనీ, దాసరి వీధి, జెండాగేరి, జంగాల కాలనీ, మారుతీనగర్ తదితర కాలనీల్లో రోడ్లను అడ్డంగా తవ్వారు. అదేవిధంగా గుత్తి ఆర్.ఎస్.లోని సూరశింగనపల్లి, హోరబ్‌చర్చి కాలనీ, మరాఠీవీధి, కర్నూలు రోడ్డు, చంద్రప్రియ నగర్, సుందరయ్య కాలనీల్లోనూ రోడ్లను ఇష్టానుసారంగా తవ్వారు. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు రోడ్లపై ఉన్న గోతుల్లో ఇరుక్కుపోతున్నాయి. పురపాలిక సంఘం రోడ్డు కటింగ్ ఛార్జీల పేరిట 2022-23లో రూ.7,5000, 2023-24లో రూ.50 వేలు వసూలు చేసింది. ఇలా ఏటా ప్రజల నుంచి సొమ్ము వసూలు చేసే అధికారులు మరమ్మతులు చేయడం లేదు. ఈ విషయమై కమిషనర్ బజ్బార్‌మియాను వివరణ కోరగా రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

సమస్య : గుంతకల్లులోని డీఎంఎం గేటు రోడ్డులో వైట్ రోజ్ స్కూల్ ఎదురుగా వీధిలోకి వెళ్లే క్రాస్‌లో విద్యుత్తు నియంత్రిక వద్ద చెత్తకుప్పలు ఉన్నాయి. **- నాగేంద్ర, వాహన చోదకుడు.**

సమాధానం : చెత్తను తొలగిస్తాం.

- సుధాకర్, శానిటరీ కార్యదర్శి, 31వ సచివాలయం

- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

18న కార్మిక సదస్సు

గుంతకల్లు పట్టణం: ఈ నెల 18న విజయవాడలో బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం గుంతకల్లులో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని మండిపడ్డారు. వీటికి వ్యతిరేకంగా కార్మికుల పలు సమస్యలపై సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వంతెన నిర్మించాలని ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన యువకులు

శింగనమల, న్యూస్‌టుడే : మరవకొమ్మ వద్ద వంతెన నిర్మించాలని కోరుతూ బుధవారం శింగనమలలో యువకులు వర్షంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ శింగనమలకు దారి లేకుండా చేశారని, ఆరు వరుసల రోడ్డుకు వంతెన నిర్మించాలన్నారు. ఈ ప్రాంత ప్రజలు శివపురం వద్దకు వెళ్లాల్సి వస్తోందన్నారు. మరవకొమ్మ వద్దకు వాహనాల రాకపోకలు లేకుండా పోతాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను గుర్తించాలన్నారు. చిన్న గ్రామాల వద్ద వంతెన నిర్మాణం చేసి నియోజకవర్గ కేంద్రానికి వంతెన లేకుండా చేశారన్నారు. వంతెన నిర్మాణం చేసి ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

గుంతకల్లు : గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని రైల్వే విశ్రాంత రక్షణ దళం సమస్యలను తక్షణం పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని గుంతకల్లు డివిజన్ ఆర్పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం డివిజనల్ సమావేశం బుధవారం గుంతకల్లులో రైల్వే ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డివిజనల్ సహాయ సెక్యూరిటీ కమిషనర్ అనిల్‌కుమార్ సింగ్, ఆ సంఘం సికింద్రబాద్ జోనల్ అధ్యక్షుడు రాయుడు, కార్యదర్శి వరప్రసాద్‌రెడ్డి, గుంతకల్లు శాఖ అధ్యక్షుడు ఎన్.సి.ఎస్. రెడ్డి, కార్యదర్శి లాల్, ఉపాధ్యక్షుడు ఎం.ఎన్. గోవిందరాజులు, కోశాధికారి జయరాముడు, తిరుపతి శాఖ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

కార్యకర్తల కష్టం ఎన్నటికీ మరువను : ఎమ్మెల్యే



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, న్యూస్‌టుడే : తన గెలుపు కోసం పాటుపడిన తెదేపా, భాజపా, జనసేన నాయకులు, కార్యకర్తల కృషిని తాను ఎప్పటికీ మరిచిపోనని గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో తన పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా తాను అండగా ఉంటానని చెప్పారు. ప్రజలు తనపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞుడనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల మధ్య ఆయన కేకు కోశారు. తెదేపా నాయకుడు నందీశ్వర్ ఎమ్మెల్యేకు క్రేన్ సహాయంతో గజమాలతో సత్కరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పట్టణ అధ్యక్షుడు ఆనంద్, నాయకులు మస్తానప్ప, వీరేశ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌డీఓ కార్యాలయం ప్రారంభం

గుంతకల్లు గ్రామీణం: పట్టణంలోని డీఎల్‌డీఓ కార్యాలయాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ బుధవారం ప్రారంభించారు. జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే కసాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. డీఎల్‌డీఓ కార్యాలయంలో అధికారులు ఏర్పాటు చేసిన కేకును ఎమ్మెల్యే కోసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి వనరులు అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో సాగునీటి వనరులను అభివృద్ధి చేయాలని సీపీఎం రాష్ట్ర రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండు చేశారు. సాగునీటి సాధన కోసం సీపీఎం నాయకులు చేపట్టిన బస్సు యాత్ర బుధవారం రాత్రి గుంతకల్లుకు చేరింది. పొట్టి శ్రీరాముల విగ్రహం సర్కిల్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రగతి చెందాలంటే వ్యవసాయం, సాగునీటి రంగాలకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు దగ్గర రిజర్వాయర్ నిర్మిస్తామని గతంలో శంకు స్థాపన చేశారే కానీ ఇంత వరకూ నిర్మించలేదన్నారు. 14 ఏళ్ల క్రితం ప్రారంభించిన హెచ్చెల్సీ కాలువ ఆధునికీకరణ నేటికీ పూర్తి కాలేదన్నారు. హంద్రీనీవా కాలువ నిర్మించినా పంటల కాలువలు లేవన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామకృష్ణ, సీపీఎం పట్టణ నాయకులు డి.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, మారుతీప్రసాద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వర్షం నీటితో అవస్థలు

గుంతకల్లు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి బయట గేటు వద్ద వర్షపు నీరు నిలుస్తుండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మోస్తరు వర్షం కురిసినప్పుడల్లా ఆసుపత్రి గేటు వద్ద నీరు నిలుస్తున్నాయి. డ్రైనేజీ లేకపోవడంతో రెండు రోజులైనా అలాగే ఉంటున్నాయి. రోగులు, వారి సహాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది ఆ నీటిల్లోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రి, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సమస్య పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు. *- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం*

'తాడిపత్రి ప్రగతికి సహకరించాల్సిందే'

తాడిపత్రి, న్యూస్‌టుడే : శుద్ధజల కేంద్రాల నిర్వాహకులు ఐఎస్ఓ సర్టిఫికేట్, ఆర్ఎంపీలు నిర్వహించే ప్రథమ చికిత్స కేంద్రాలకు అనుమతులు తప్పనిసరిగా కలిగి ఉండాలని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. అనుమతులుంటేనే తాడిపత్రి పురపాలికలో పరిధిలో వాటిని నిర్వహించుకోవాలన్నారు. లేనట్లయితే వాటిని పొందేందుకు రెండు నెలలు గడవు ఇస్తున్నట్లు చెప్పారు. బుధవారం తాడిపత్రి మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఎంపీ, ల్యాబ్ టెక్నీషియన్లు, నీటి శుద్ధకేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మీరు జీవించేందుకు తాడిపత్రి కావాలి. కానీ తాడిపత్రి అభివృద్ధి జరిగేందుకు మీ అవసరం లేదా..? పట్టణ అభివృద్ధికి అందరూ పాటు పడాల్సిందే.' అని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీలు, ల్యాబ్ నిర్వాహకులు వ్యవహరించవద్దని, అధిక డబ్బులు వసూలు చేసినా, ఎక్కడబడితే అక్కడ చెత్త వేసినా ఊరుకునేది లేదని హెచ్చరికలు చేశారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, వైస్‌ఛైర్మన్ అబ్దుల్ రహీం పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



ప్రహరీ నిర్మించేదెన్నడు?

పామిడిలో 1.34 ఎకరాల విస్తీర్ణంలో రూ.5.80 కోట్లతో నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించి సంవత్సర కాలం గడుస్తున్నా నేటికీ ప్రహరీ నిర్మాణం పూర్తికాలేదు. ఆసుపత్రి ముందు భాగంలో మట్టి తరలించలేదు. దీంతో ఆ ప్రాంతంలో ముళ్ల పొదలు పెరిగి అపరిశుభ్రంగా ఉండటంతో విష కీటకాల సంచరిస్తున్నాయి. ప్రహరీ లేకపోవడంతో ఆసుపత్రి ప్రాంగణంలోకి పశువులు తిష్ఠ వేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని వైద్య సిబ్బంది, రోగులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పామిడి**

అనుచిత వ్యాఖ్యలపై ఫిర్యాదు

నార్పల, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే శ్రావణిశ్రీపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని నార్పల తెదేపా నాయకులు బుధవారం ఎస్ఐ సాగర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల హెచ్చెల్సీ కాలవ దగ్గర నీటి కోసం రైతులు వాగ్వాదం చేసుకున్న సమయంలో వెంకటాంపల్లికి చెందిన కొందరు వ్యక్తులు ఎమ్మెల్యేను దూషిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పుట్లూరు, న్యూస్‌టుడే : ఓ మహిళ అనుమానాస్పద మృతిపై బుధవారం ఫిర్యాదు అందినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. కర్ణాటకలోని బీదర్ జిల్లా తూబల్‌గుడి గ్రామానికి చెందిన సంగీత (21) పుట్లూరు మండలం కొండాపురంలోని ఓ హోటల్లో పనిచేస్తుండేది. ఆమె నాలుగు రోజుల కిందట విషపుగుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు మూడేళ్ల పాప, భర్త ఉన్నారు. ఆమె సోదరుడు సునీల్ సంగీత మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతూ వివాహిత..

తాడిపత్రి : తాడిపత్రి మండలంలోని వెంకటరెడ్డి గ్రామం వద్ద ఈ నెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సుంకులమ్మపాళెం చెందిన చంద్రశేఖర్, సుజాతలు ద్విచక్ర వాహనంలో నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాల గ్రామానికి వెళ్తుండగా వెంకటరెడ్డిపల్లి వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ప్రమాదంలో గాయపడిన ఆ ఇద్దరిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ సుజాత (43) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కేతిరెడ్డి పెద్దారెడ్డి వ్యాజ్యంలో వివరాలు సమర్పించండి

ఈనాడు, అమరావతి : తాడిపత్రిలోని తన ఇంటి వద్ద భద్రత కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంలో వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. భద్రత కల్పించాలంటూ ఎస్పీకి ఏమైనా వినతి సమర్పించారా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. నతి ఇస్తేనే కదా స్పందించేందుకు అవకాశం ఉండేది అని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ల జప్తు

తాడిపత్రి : తాడిపత్రి పరిసరాల్లోని పెన్నానదిలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను జప్తు చేసినట్లు గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. దేవేంద్ర రెడ్డి, పవన్‌కుమార్‌లకు చెందిన ట్రాక్టర్లు పెన్నానదిలో ఇసుక లోడ్ చేస్తుండగా గుర్తించామన్నారు. ఆ ట్రాక్టర్ల పట్టుకుని కేసు నమోదు చేసి జప్తు చేశామన్నారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

యాడికి : చెడు స్నేహం చేయొద్దని మండలంలోని పచ్చారుమేకలపల్లికి చెందిన రంగస్వామి తన తమ్ముడు రాఘవేంద్రకు మందలించాడు. ఈ విషయం అతని స్నేహితులు కల్యాణ్, కిశోర్, కంబగిరి రాముడులకు తెలియడంతో రంగస్వామిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాడికి పోలీసులు తెలిపారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ అబింకా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని ముంటిమడుగు కొత్తపల్లిలో బుధవారం పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలు నిర్వహించారు. రూ.49.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వారు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో దీపావళికి ఉచిత గ్యాస్ సిలెండరు, త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నెరవేర్చనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి రాధిక, ఎంపీటీసీ సభ్యుడు సురేంద్ర, మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాలాక్షి, నాయకులు కృష్ణారెడ్డి, పాండు, గణేశ్, నెట్టికల్లు, నారపరెడ్డి, గంగాధర్, రాము, హరి, రాజు, సుంకన్న, ఫీరా, ప్రవీణ్, జయరాం, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

చేతికొచ్చిన వరి పంట నాశనం

పామిడి, న్యూస్‌టుడే : మండలంలోని కండ్లపల్లికి చెందిన మహిళా రైతు లక్ష్మీదేవి తనకున్న 4 ఎకరాల పొలంలో వరి సాగు చేసింది. నాలుగు రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తులు చేతికొచ్చిన వరి పంటకు గడ్డి మందు పిచికారీ చేయడంతో పొలం మొత్తం నాశనమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం కూడా ఇదేవిధంగా గడ్డి మందు చల్లి తనకు నష్టపరిచారని కన్నీరుపెట్టారు. తక్షణమే పోలీసులు చర్యలు తీసుకుని ఆమెకు న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కండ్లపల్లిలో దెబ్బతిన్న పంట

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు



జ్యోతులతో గ్రామస్థులు

వైభవంగా వాల్మీకి జయంతి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని తోపుదుర్తి గ్రామంలో బుధవారం వాల్మీకి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకులు జ్యోతులు, బోనాలతో వాల్మీకి విగ్రహం వద్దకు చేరుకుని పూజలు చేశారు. మహర్షిగా ఎదిగిన తీరును వక్తలు వివరించారు. అనంతరం గ్రామంలో అన్నదానం నిర్వహించారు.

చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు

రాంనగర్(అనంతపురం) న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, పంటలకు పురుగులు, తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గ్రామీణం వ్యవసాయాధికారిణి శశికళ సూచించారు. బుధవారం అనంతపురం గ్రామీణం కక్కలపల్లి, కాటిగానికాల్వ రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. వేరుసెనగ, కంది పంటకు ఆశించిన తెగుళ్లు గుర్తించారు. ప్రస్తుతం ముసురు వాతావరణం ఉందని, మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండదన్నారు. ఆయా పంటలకు ఆశించిన తెగుళ్లకు పొడి వాతావరణంలో సస్యరక్షణ చర్యలతో నివారించుకోవచ్చన్నారు.

ప్రతి పల్లె అభివృద్ధి చెందాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి పల్లె అభివృద్ధి చెందాలని ఎంపీడీవో లక్ష్మీ నరసింహ పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని వేపచర్ల, ముట్టాల, గొరిదిండ్ల, వేపచర్ల దిగువ తండా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణానికి పునాదులు వేసిందన్నారు.

చెరువులను నింపాలి

బుక్కరాయసముద్రం: పీఏబీఆర్ నీటితో సిద్ధరాంపురం, బి.పప్పూరు చెరువులను నింపాలని సీపీఎం నాయకులు ఒ.నల్లప్ప డిమాండు చేశారు. గ్రామాల్లో సాగు తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన బుక్కరాయసముద్రంలో బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన

అనంత నేరవార్తలు: జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం స్థానిక కాన్ఫరెన్సు హాలులో పోలీసులకు సీపీఆర్‌పై వైద్యులు అవగాహన కల్పించారు. జిల్లా సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, అసోసియేట్ ప్రొఫెసర్ భూషణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నాగరాజు, సౌజన్య, జిల్లా పోలీసు యూనిట్ ఆసుపత్రి వైద్యుడు వెంకటేశ్వరప్రసాద్‌లు పాల్గొని అవగాహన కల్పించారు.

'నివాసాల మధ్య మద్యం దుకాణాలొద్దు'

ఆజాద్‌నగర్ (అనంతపురం): ప్రజలు నివసించే ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయొద్దని ఐద్వా బుధవారం ప్రకటనలో డిమాండ్ చేసింది. ఐద్వా నాయకురాలు సావిత్రి మాట్లాడుతూ.. మద్యం నియంత్రించాలని ఆందోళనలు చేస్తున్నా.. పట్టించుకోకుండా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. రాత్రి 10 గంటల వరకు దుకాణాలు తెరిచి ఉంచితే మహిళలు ఇబ్బందులు గురవుతారని, ఆ విషయాన్ని ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.

పప్పుసెనగ ఎకరాకు 50 కిలోలు ఇవ్వాలి

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: రైతులకు విత్తన పప్పుసెనగ విత్తనాలను ఎకరాకు 50 కిలోలో పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఎకరాకు 40 కిలోలు మాత్రమే ప్రకటించిందని, అవి ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. కొన్ని గ్రామాల్లో రైతు సేవాకేంద్ర అధికారులు ఎకరాకు 20 కిలోలు మాత్రమే ఇస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు.

సర్వజన వైద్యశాలలో సేవలపై ఆరా

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పీడియాట్రిక్, గైనిక్, అనస్తీషియా, హెల్త్ అడ్మినిస్ట్రేషన్ విభాగాలను ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నియమించిన వైద్యుల బృందం సభ్యులు, వైద్యులు విద్యాసాగర్, విజయానంద్‌బాబు, స్విర్ల, సుధీర్‌లు బుధవారం పరిశీలించారు. పీజీ సీట్ల పెంపులో భాగంగా బృంద సభ్యులు ఆయా విభాగాలలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలతో పాటు సౌకర్యాలను పరిశీలించారు. గతంలో పీడియాట్రిక్ నాలుగు, గైనకాలజీ 12, అనస్తీషియా 6 పీజీ సీట్లు ఉండగా అడ్మినిస్ట్రేషన్ విభాగంకు పీజీ సీట్లు లేవు. బృంద సభ్యులు వైద్యశాలలో పరిశీలించిన అంశాలపై యూనివర్సిటీకి నివేదిక ఇవ్వనున్నారు.

కులమతాలకు అతీతంగా గ్యార్మీ వేడుకలు


రాంనగర్: ఏటా కుల మతాలకు అతీతంగా గ్యార్మీ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం నగరం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో గ్యార్మీ వేడుకలు ఎమ్మెల్యే హాజరయ్యారు. ముందుగా మహబూబ్ సుబహానీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాకు తమ వంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : **గంగ, త్రివేణి, నీలిమ** : వేట్టయన్, **గాయత్రి** : మర్టీన్, **గౌతమి** : జీబ్ర, **గౌరి, ఎస్వీ సినిమాక్స్, సుధా** : దేవర, **తరంగిణి** : విశ్వం, **తేజస్విని** : మా నాన్న సూపర్‌హీరో.

కురుస్తున్న వర్షాలు.. కూలే స్థితిలో భవనాలు!

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: తుపాను వల్ల రెండు రోజుల నుంచి అనంతపురంలో వర్షాలు కురుస్తున్నాయి. శిథిలావస్థలో ఉన్న భవనాలు ఎప్పుడు కూలుతాయో అన్న భయం నెలకొంది. పట్టణ ప్రణాళిక అధికారులు మాత్రం కునుకు వీడటం లేదు. శిథిలం అంచున ఉండి ప్రజలకు ఇబ్బంది కల్గించే భవనాలను మున్సిపల్ చట్టం ప్రకారం తొలగించే అధికారం ఉంది. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రైవేటు భవనాలు కూడా శిథిల స్థితిలో ఉన్నా తొలగించలేదు. కొన్నిచోట్ల జన సంచారం ఉన్న ప్రాంతాల్లోనే ఉండగా మరికొన్ని ప్రాంతల్లో ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లోనే ఉన్నాయి. మరో 24 గంటలపాటు తుపాను ప్రభావం ఉండటంతో మరింత అప్రమత్తత తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది.



టీటీడీ ఎదురుగా కూడలిలో శిథిల భవనం

ఎక్కువగా ఎక్కడెక్కడ అంటే..

పాతూరులోని మార్కెట్ వద్ద నగరపాలక వ్యాపార సముదాయం, మటన్ మార్కెట్ వద్ద వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన దుకాణాలు, గాంధీ బజార్, తిలక్‌రోడ్డుతో పాటు నివాసాల సముదాయాల వద్ద పలు ప్రైవేటు భవనాలు ఉన్నాయి. సాయినగర్, కమలానగర్, గుల్జార్‌పేట, రామచంద్రనగర్, మొదటి, రెండో రోడ్డులో ఎక్కువగా పాత భవనాలు ఉన్నాయి.

కూడలిలో ప్రమాదం

రైల్వే ట్రాక్ దాటిన అనంతరం టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా పెద్ద భవనం ఉంది. పలు ప్రాంతాలకు వెళ్లే కూడలి ఇది. టీటీడీలో వివాహాలు జరిగితే పలువురు ఇతర ప్రాంతాల వారు వచ్చి భవనం ఉందని అక్కడ కాసేపు ఆగుతున్నారు. నిరాశ్రయులు, తాగుబోతులు భవనం వద్ద ఉంటున్నారు. పై అంతస్తు అంతా కూలిపోయింది. కింది భాగంలో మాత్రం ఉంటున్నారు. ఒకవైపు పూర్తిగా శిథిలం కావడంతో దుకాణాలు మూసివేయగా మరోవైపు ఇంకా దుకాణాలు అలాగే ఉన్నాయి. ప్రమాదం జరిగితేనే నగరపాలక కళ్లు తెరుస్తుందా? అని విమర్శలు వస్తున్నాయి.

ప్రమాదం చెంతనే

పాతూరు తాడిపత్రి బస్టాండ్ వద్ద ఉన్న నీటి ట్యాంకు పై కప్పు కూలి ట్యాంకులోకి పడి మూడేళ్లు దాటుతోంది. ట్యాంకును 1982 సెప్టెంబరు 29న ప్రారంభించారు. ఇప్పటికే 42 ఏళ్లు అవుతోంది. శిథిల ట్యాంకును తొలగించి కొత్తది నిర్మాణం చేయడానికి కేవలం టెండర్లతోనే సరిపెడుతున్నారు. తొలగించింది లేదు కొత్తది నిర్మాణం చేసిందీ లేదు. ట్యాంకుకు ఉన్న పిల్లర్లు దెబ్బతిన్నాయి. ట్యాంకు కింద నిత్యం పలు ప్రాంతాల వారు సేద తీరుతున్నారు. పక్కనే సచివాలయం ఉండటంతో సచివాలయానికి వచ్చే ప్రజలు కూడా అక్కడకు వెళ్లి కూర్చుంటున్నారు. పైకప్పు కూలి ట్యాంకులోకి పడటంతో వర్షం నీరు పడి ట్యాంకులోకి చేరుతుండటంతో ఎప్పుడైనా కుప్పకూలే ప్రమాదం ఉంది.



శిథిలావస్థకు చేరిన ట్యాంకు

పెచ్చులూడి ఇనుప కడ్డీలు బయటకు

రామచంద్రనగర్‌లో ఓ భవనం రోడ్డు వైపునకు ఉంది. గతంలో ఈ భవనం ఎప్పుడూ రద్దీగా ఉండేది. 43 ఏళ్ల క్రితం భవనం నిర్మించారు. సన్ సైడ్ అంతా దెబ్బతిని పెచ్చులూడి ఇనుప కడ్డీలు బయటకు కన్పిస్తున్నాయి. ప్రస్తుతం అందరూ ఖాళీ చేశారు. ముందు భాగంలోనే చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. రోడ్డు పక్కనే పై అంతస్తు భవనం కావడంతో వర్షాలకు తడిసి సన్‌సైడ్ మరింత దెబ్బతిని కూలే ప్రమాదం పొంచి ఉంది.



శిథిలావస్థకు చేరిన రామచంద్రనగర్ ప్రధాన రోడ్డులోని భవనం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)
అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య: బిందెల కాలనీలోని పోలు నంబరు ఎన్15/38కు ఉన్న వీధి లైటు మరమ్మతు చేసినా మళ్లీ వెలగడం లేదు **-క్రిష్ణ**

సమాధానం: కొత్తది అమర్చి సమస్య తీర్చుతాం.

సమస్య: కమలానగర్ కొత్తూరు మార్కెట్ సమీపంలో పెద్ద కాలువకు రాళ్లు అడ్డంగా పడటంతో మురుగు ముందుకు వెళ్లడం లేదు. **- గిరెప్ప**

సమాధానం: వెంటనే రాళ్లు తొలగించి నీరు వెళ్లే విధంగా చర్యలు చేపడతాం

(పై ప్రశ్నలకు నగరపాలక డీఈ దాక్షాయిణి, ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి సమాధానాలు ఇచ్చారు) – న్యూస్‌టుడే, అశోక్‌నగర్

ఘనంగా గౌరమ్మ పండగ

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలంలోని బండమీదపల్లిలో బుధవారం ఘనంగా గౌరమ్మ పండుగ నిర్వహించారు. ప్రతి ఏడాది జరిగే ఈ గౌరమ్మ పండగకు ప్రతి ఇంటికి ఆడపడుచులు విచ్చేస్తారు. ఈ ఏడాది దసరా పండుగ అనంతరం గ్రామంలోని ఆలయంలో గౌరమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి యువతులు ప్రతి రోజూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం వాయిద్యాల నడుమ ఊరేగించి.. చెరువులో నిమజ్జనం చేశారు.



బండమీదపల్లిలో గౌరమ్మ నిమజ్జనం

అనంతేశ్వరస్వామికి కల్యాణోత్సవం

నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి, అనంతేశ్వర స్వామిలకు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అభిషేకాలు చేశారు. ఉత్సవ మూర్తులను అలంకరించారు. ఉదయం హర్షాస్వామి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. – న్యూస్‌టుడే, అశోక్‌నగర్



రోజంతా జల్లులు.. ఇళ్లు దాటని ప్రజలు



పాతూరు తాడిపత్రి బస్టాండ్ వద్ద చిత్తడి

ఈనాడు, అనంతపురం, అశోక్‌నగర్, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో రోజంతా చిరు జల్లులు పడ్డాయి. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు అనంతపురంలో 16.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. బుధవారం 9 గంటల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మళ్లీ రాత్రి 9.30 గంటలకు వర్షం ప్రారంభమైంది. తుపాను కారణంగా కాసేపు ఆగి మరి కొంతసేపు జల్లులతో కూడిన వర్షం వస్తుండటంతో ప్రజలు, ఇతర ప్రాంతాల వారు ఇళ్లు విడిచి బయటకు వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. రోజంతా జల్లులతో కూడిన వర్షం వస్తుండటంతో నగరంలోని పలు ప్రాంతాలు చిత్తడిగా మారాయి. విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వటంతో ప్రధాన రహదారుల్లో రద్దీ తక్కువగా కనిపించింది. ఎట్టకేలకు వర్షం ప్రభావంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.



వర్షంలోనే ప్రయాణాలు

నేడు శివకోటిలో సత్యనారాయణ వ్రతం

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలోని బెంగళూరు రోడ్డులో ఉన్న శివకోటి శ్రీ పీఠంలో పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నామని ఆలయం కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం సాయంత్రం 6 గంటలకు వ్రతం ఉంటుందన్నారు. పూజలో పాల్గొనబోయే భక్తులు 85008 50016, 70366 46646 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నియామక పత్రం జారీ

ఎస్కేయూ, న్యూస్‌టుడే: రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మహిళా విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలుగా ఉమాదేవి నియమితులయ్యారు. ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండీ నాగభూషణ నియామక పత్రాలు జారీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత ముఖ్యం

అశోక్‌నగర్, న్యూస్‌టుడే: వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం పొంచి ఉందని వేగంగా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని మేయర్ వసీం ఆదేశించారు. బుధవారం నగరంలోని అశోక్‌నగర్ బ్రిడ్జి వద్ద కాలువలో అడ్డంగా పడిన వ్యర్థాలను తొలగించే ప్రక్రియను మేయర్ పరిశీలించారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షం ఆగిపోగానే వేగంగా పారిశుద్ధ్యం చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలను అప్రమత్తంగా ఉండే విధంగా సూచనలు ఇవ్వాలన్నారు. నిల్వ ఉన్న నీరు లేకుండా చేయడం, పాత టైర్లు, టెంకాయ చిప్పలు నివాసాల వద్ద లేకుండా చూడాలన్నారు.

కంకర తేలి.. ముళ్లబాటలా మారి

రాప్తాడు, న్యూస్‌టుడే : అనంతపురం రూరల్ కందుకూరు బీటీ రహదారి అధ్వాన స్థితికి చేరుకుంది. గత వైకాపా ప్రభుత్వంలో రహదారి వేసి మూడు సంవత్సరాలు కాకముందే రోడ్డు నాసిరకంగా వేయడంతో పూర్తిగా దెబ్బతింది. రహదారి కంకర తేలి ముళ్లబాటను తలపిస్తోంది. రోడ్డుకు ఎదురుగా వాహనాలు వస్తే కిందకు దిగడానికి లేక రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కాలువ ఏర్పాటుతో ప్రజలకు ఊరట

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రధాన కాలువలను తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు బుధవారం శుభ్రం చేయించారు. ఆత్మకూరు చెరువు నుంచి వర్షపు నీరు ముందుకు వెళ్లేందుకు కాలువ లేక స్థానిక ఎస్సీ కాలనీలోకి వెళ్లేది. అయితే తుపాను నేపథ్యంలో ఎస్సీ కాలనీ వాసులు ఇబ్బంది పడకుండా నీరు ముందుకు సాగేందుకు కాలువను ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత సూచనలతో కాలువ పనులు ప్రారంభించామని వివరించారు. తెదేపా నాయకులు శశాంక్ చౌదరి, అక్కులన్న, రామదాసు, ఓబుళపతి పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాసులు

కాలువలకు మరమ్మతులు చేయించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని సాగు నీటి కాలువలకు మరమ్మతులు చేయించాలని సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్ కోరారు. మండలంలోని తలుపూరు, వడ్డుపల్లి గ్రామాల్లో సాగునీటి పథకాలపై బుధవారం సీపీఎం నాయకులు కరపత్రాలను పంచారు. జలవనరుల అభివృద్ధి పనుల కోసం సీపీఎం పార్టీ ఆధర్యంలో బస్సు యాత్ర చేపడుతున్నామని అన్నారు. పీఏబీఆర్ కాలువ ద్వారా మండలంలోని అన్ని చెరువులకు, కుంటలకు, చెక్‌డ్యాంలకు నీటిని అందించాలని డిమాండ్ చేశారు. తుంగభద్ర ఎగువ కాలువను ఆధునీకరించాలని సూచించారు. ఈ నెల 19న తలుపూరు, వడ్డుపల్లి గ్రామాల్లో బస్సుయాత్ర జరుగుతుందని తెలిపారు.



ప్రచార పత్రాలను పంచుతున్న సీపీఎం మండల

సమస్యల వలయంలో స్టడీ పార్కు

వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేందుకు రెండవ రోడ్డులో స్టడీపార్కు ఏర్పాటయ్యింది. ఇక్కడ తగిన సౌకర్యాలు లేకపోగా వర్షం వస్తే మరిన్ని ఇబ్బందులు తప్పటంలేదు. చిన్న వర్షానికే పార్కు బురదమయంగా మారటంతో చదువుకునే వారు రావటం లేదు. పార్కులో సైతం పలుచోట్ల నీరు నిలిచిపోతోంది. ఇప్పటికే పార్కులో చాలావరకు బెంచీలు శిథిలమయ్యాయి. పార్కులో ప్రశాంతంగా చదువుకునే వీలు లేకుండా పోతోంది. – ఈనాడు, అనంతపురం



పార్కులో విద్యార్థులు చదువుకునే ప్రాంతంలో నిలిచిన వర్షపునీరు...

అల్లుకున్న నిర్లక్ష్యం



రుద్రంపేట పంచాయతీ పరిధి రిలయన్స్ సెల్ టవర్స్ సమీపాన జాతీయ రహదారి నంబరు-44 పక్కన విద్యుత్తు తీగలకు తీగ జాతి మొక్కలు అల్లుకున్నాయి. వర్షం కురుస్తున్నందున తీగల నుంచి నిప్పు రవ్వలు రాలుతున్నాయని వెంటనే తొలగించాలని స్థానికులు, చోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, రుద్రంపేట

కాలనీలు సరే.. రోడ్లు ఏవీ?

జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణాలను చేపట్టామని వైకాపా నాయకులు ఆ ప్రభుత్వ హయాంలో బీరాలు పలికారు. కాలనీలో 40 శాతం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయలేదు. వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఉన్న అద్దె ఇళ్లను వదిలి కొత్త నిర్మాణాలు చేపట్టలేక సతమతమవుతున్నారు. ఎక్కడా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టలేదు.
- న్యూస్‌టుడే, ఆత్మకూరు



గుంతలతో వేదన ఇంకెన్నాళ్లు?

నగర రోడ్లు నరకానికి ఆనవాళ్లుగా మారుతున్నాయి. గుంతలు అంతకంతకు పెరిగి ప్రయాణం దుర్భరంగా మారుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై అధ్వాన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రుద్రంపేట పంచాయతీ పరిధి చంద్రబాబు నగర్‌లో వర్షం నీరు రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రహదారులు సమాంతరంగా నిర్మించకపోవడంతో గుంతలు ఏర్పడిన చోటకు వర్షం నీరు చేరుతోంది. – న్యూస్‌టుడే, రుద్రంపేట





రాంనగర్‌లోని పాత ఆర్టీవో కార్యాలయం దారి ఘోరంగా మారింది. జిల్లా తెదేపా కార్యాలయం సమీపంలో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. రెండ్రోజులుగా వాన కురుస్తుండటంతో గుంతల్లో నీరు నిలిచింది. – న్యూస్‌టుడే, రాంనగర్

ఏఆర్ డీఎస్పీ మునిరాజుకు వీడ్కోలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం ఏఆర్ పోలీసు విభాగానికి ఏఆర్ డీఎస్పీగా మునిరాజు సేవలు అభినందనీయమని జిల్లా పి.జగదీశ్ పేర్కొన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న మునిరాజుకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా పోలీసు కాన్ఫరెన్సు హాలులో సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించండి

రాంనగర్(అనంతపురం) : రాష్ట్రంలో ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు సురేశ్‌కుమార్‌రెడ్డి, ఇతర సభ్యులు కోరారు. బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుకి వినతిపత్రం అందజేశారు. యూరియా కావాలంటే నానో యూరియాతో పాటు ఇతర ఎరువులు, మందులను కంపెనీలు అంటగడుతున్నాయని మంత్రికి ఫిర్యాదు చేశారు. కంపెనీ ప్రతినిధులతో పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. సంఘం ఆధ్వర్యంలో కృష్ణా జిల్లాలో వరద బాధితులకు 1000 కుటుంబాలకు టార్పాలిన్ పట్టలు పంపిణీ కార్యక్రమానికి రావాలని మంత్రి ఆహ్వానించారు.

శస్త్రచికిత్సల్లో మత్తు వైద్యులదే కీలక పాత్ర

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: రోగులకు ఎలాంటి శస్త్ర చికిత్సలు చేయాలన్న మత్తు(అనస్తీషియా) వైద్యులది కీలక పాత్ర అని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ప్రపంచ అనస్తీషియా దినం సందర్భంగా అనంతపురంలోని ప్రభుత్వ వైద్యకళాశాల నుంచి సప్తగిరికూడలి వరకు ప్రజలకు అనస్తీషియాపై అవగాహన కల్పించేందుకు వైద్యులు, వైద్యవిద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు.

సల్లాపురమ్మ గుడి పూజారి ఆకస్మిక మృతి

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం బండమీదపల్లి గ్రామ దేవత సల్లాపురమ్మ గుడిపూజారి మాధవరాజు బుధవారం ఆకస్మికంగా మరణించాడు. మాధవరాజు మొదటి నుంచి తెదేపా వీర విధేయులు, బండమీదపల్లి తెదేపా నాయకులు కార్యకర్తలు మృతదేహానికి నివాళులర్పించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, రాప్తాడు మండల తెదేపా ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళి ఆదేశాల మేరకు మాధవరాజు కుటుంబ సభ్యులకు 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

యువకుడు ఆసుపత్రిపాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన సొహైల్ గాయాలతో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేరాడు. యువకుడు ఐదు రోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వివాహం తల్లికి ఇష్టం లేదు. దిశ పోలీసులు బుధవారం కౌన్సెలింగ్‌కు పిలిపించారు. అనంతరం 'తనపై తల్లి, మేనమామ దాడి చేశారని బాధితుడు చెబుతున్నాడు. యువతిని తన నుంచి విడదీస్తారనే భయంతో తనను తానే రాయితో కొట్టుకుని గాయపరుచుకున్నాడని అతని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

అనంత నేరవార్తలు: అనంతపురం నగరం బళ్లారి రోడ్డు కూడలిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. నారాయణనాయక్ కూడలిలో ఉండగా బళ్లారి వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు ఓ వైపు తాకింది. వృద్ధుని ఎడమ కాలికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణను రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానంలో నిలవాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం అనంతపురం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పీఏసీఎస్ (ప్రైమరీ అగ్రికల్చరల్ కో ఆపరేటివ్ సొసైటీ)ల్లో కంప్యూటరీకరణను ప్రక్రియపై ఆర్డీఓలు, డీఎల్డీఓలు, డీసీఓ, డీఎల్‌పీఓ పీఏసీఎస్ సీఈఓలు, సూపర్ వైజర్లతో, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రక్రియను నవంబరు 1 నాటికి వందశాతం పూర్తి చేయాలన్నారు. సహకార సంఘాల్లోని సభ్యులందరూ ఆధార్ కార్డును, కేవైసీని సీఈఓకు ఇచ్చి సహకరించాలని సూచించారు.